క్లుప్తంగా

అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



అమలాపురం టౌన్: స్థానిక రవణం మల్లయ్య వీధిలో వేంచేసి యున్న అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామికి సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆ వీధి మైనర్స్ పార్టీ ప్రతినిధులు భక్తులకు సేవలందించారు. స్వామివారికి నిర్వహించిన సహస్ర అప్పముల పూజ కన్నుల పండువగా జరిగింది. పలు పత్రాలు, పుష్పాలతో వేద మంత్రాల నడుమ పూజలు చేశారు. వార్షికోత్సవ పూజల్లో భాగంగా స్వామివారి గ్రామోత్సవాన్ని రవణం మల్లయ్యవీధి ప్రజలు ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ వైభవంగా నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం ఆలయం వద్ద జరిగిన భారీ అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ వీధి పెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాను అడ్డుకోండి

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన డి.ప్రశాంత్ కుమార్‌ను భజరంగ్ దళ్ ప్రతినిధులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అమలాపురం పరిసర గ్రామాల్లో గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని, ఏ ఒక్క గోవు రవాణా కాకుండా చర్యలు చేపట్టాలని సీఐకి భజరంగ్ దళ్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఆ సంస్థ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు ఆధ్వర్యంలో బృంద సభ్యులు సీఐని కలిశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తాళ్లరేవు: మండల పరిధిలోని కోరంగి పంచాయతీలో రూ.21 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి గ్రామ సర్పంచ్ పెయ్యల మంగేష్ సోమవారం భూమిపూజ చేశారు. పంచాయతీ పరిధిలోని పెదబొడ్డు, చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామాలలో రూ.8.8 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారులు, రూ.9.5 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీలు, రూ.3 లక్షల వ్యయంతో నిర్మించనున్న పాటికాలువ రేవు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణ, నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, కొపనాతి నాగరాజు, వాడ్రేవు వీరబాబు, పెయ్యల శ్రీనివాస్, బర్రే బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో రైతాంగం పాత్ర కీలకం

యానాం: జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో యానాం ఫార్మర్స్, ప్రొడ్యూసర్స్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్ అధ్యక్షతన పలువురు రైతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రైతులు మొలగజ్జల ఆనందరావు, చింతలపూడి సత్యనారాయణ, రాంబాబు, యర్రా జగన్నాథరావు, వేగేశ్న సూర్యనారాయణరాజు, అన్యం సీతారామయ్య, కోన వెంకట్రావు, ఎఫ్‌పీఓ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బ్లెస్సి, కురేషి పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అమలాపురం రూరల్: అల్లవరం మండలం గోడిలంక గ్రామంలోని రాజుగారి వీధిలో పంచాయతీ సిమెంట్ రోడ్డును ఈ నెల 4వ తేదీన గ్రామానికి చెందిన సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు, సురేష్‌రాజు, శ్రీసురాజులు జేసీబీతో పగులగొట్టి మట్టితో సహా ట్రాక్టర్లమీద లోడ్ చేసి తీసుకుని వెళ్లారని అదే గ్రామానికి చెందిన రుద్రరాజు వెంకటరాజు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ నిధులను వృధాగా ఖర్చు చేస్తున్నారని ఎటువంటి తీర్మానం, రైతుల అంగీకారం లేకుండా మళ్లీ రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు. వారిపై చర్య తీసుకొని రోడ్డు నిర్మాణం నిలిపి వేయాలని కోరారు.

విశ్రాంత విద్యాశాఖాధికారి మృతికి సంతాపం

యానాం: ప్రాంతీయ విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పులపకూర వెంకటేశ్వరి(80) సోమవారం మృతి చెందారు. నియోజకవర్గ పరిధిలో వివిధ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయినిగా సేవలందించి విద్యాశాఖాధికారిగా పదోన్నతి పొందారు. ఆమె మృతికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఉపాధ్యాయులు, దళిత నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రకృతి విపత్తుల పట్ల అవగాహన

తాళ్లరేవు: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్‌డీఆర్‌ఎఫ్‌డీ ఎస్సీ ఎస్.మన్మథరావు సూచించారు. సోమవారం చొల్లంగి హైస్కూల్‌లో ప్రకృతి విపత్తులను ఎదుర్కొనే తీరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు పలు ప్రమాదాల పట్ల అవగాహన కల్పించారు. అగ్నిమాపకశాఖ ఏడీఎఫ్‌ఓ ఇంచార్జ్ పి.కృష్ణదొర, ఆపరేటర్ సత్యనారాయణ, ఎల్ఎఫ్ సతీష్, ఫైర్‌మేన్ లక్ష్మణరావు తదితరులు వంటగదిలో గ్యాస్ వల్ల సంభవించే ప్రమాదాల నివారణపై మహిళలకు వివరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

అనధికార అమ్మకాలకు అడ్డేదీ..?

- గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బెల్టు షాపులు
- పగలు, రాత్రి తేడా లేకుండా విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



అల్లవరం ప్రధాన రహదారిలో రామాలయం సమీపంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణం

అల్లవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీ విధానం ద్వారా ఎంపిక చేసిన ప్రాంతాల్లో మద్యం షాపులకు లైసెన్సులు మంజూరు చేసి, తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందిస్తామని గొప్పగా ప్రచారం చేసుకుంది. ఆ దిశగా షాపులు ఏర్పాటు చేసి మద్యం షాపుల్లో మాత్రమే అమ్మకాలు జరుగుతాయని, ఎక్కడా బెల్ట్ షాపులకు ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని స్వయంగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. అక్టోబర్ 12 నుంచి మద్యం వ్యాపారాలు ప్రారంభం కాగా మద్యం షాపులు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో అనధికార మద్యం అమ్మకాలకు వెనువెంటనే తెర తీశారు. కూటమి ప్రభుత్వానికి చెందిన కార్యకర్తలే అధికార పలుకుబడితో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు చేస్తున్నారు. మద్యం షాపుల నుంచి మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి బెల్ట్ షాపుల్లో అధిక ధరలకు అమ్మకాలు చేస్తున్నారు. అనధికార బెల్ట్ షాపుల్లో రాత్రి, పగలు తేడా లేకుండా అమ్మకాలు చేస్తున్నారు. ప్రతి మద్యం దుకాణం పరిధిలో ఐదు నుంచి పది వరకు బెల్టు షాపులు వెలిశాయి. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించటం వీరి పాలిట వరంగా మారింది. ఇక మత్స్యకార గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు చేసుకునేందుకు ఏకంగా వేలం పాటలు నిర్వహించారు. అల్లవరం మండలం ఎస్.రామేశ్వరం, రెబ్బనపల్లి, ఉప్పలగుప్తం మండలం ఎన్.కొత్తపల్లి గ్రామాల్లో లక్షల్లో వేలం పాటలు జరగడం ఆశ్చర్యానికి గురి చేసింది. మద్యం షాపులు లేని గ్రామాల్లో మద్యం బాబులు దోపిడీకి గురవుతున్నారు. వారి నుంచి అధిక ధరలు వసూలు చేసి నిలువునా మోసం చేస్తున్నారు. మద్యం షాపుల పరిధిలో బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు చేసిన హెచ్చరికలు వట్టి మాటలుగానే మిగిలాయి. మద్యం అధిక ధరలకు విక్రయిస్తే రూ.5 లక్షల జరిమానా, రెండో సారి అతిక్రమిస్తే షాపు లైసెన్స్ రద్దు, బెల్ట్ షాపు నిర్వహిస్తే రూ.5 లక్షల జరిమానా, జరిమానా విధించిన తర్వాత కూడా అమ్మకాలు చేస్తే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని ఎక్సైజ్ చట్టంలో మార్పులు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో బెల్ట్ షాపులు మూత పడలేదు. స్థానిక నాయకులు, అధికారుల అండదండలతో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి.

అమలాపురం నియోజకవర్గ పరిధిలో అల్లవరంలో 6, ఉప్పలగుప్తంలో 4, అమలాపురం టౌన్ పరిధిలో 4, రూరల్ పరిధిలో 5 షాపులు ఉన్నాయి. అల్లవరం, ఉప్పలగుప్తం, చల్లపల్లిలో దుకాణాలను ప్రధాన రహదారిని ఆనుకొని నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారు. అమలాపురం నియోజకవర్గ పరిధిలోని మద్యం షాపులకు అనుబంధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే సహించేది లేదని స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం అమలాపురంలో జరిగిన ఓ కార్యక్రమం వేదికగా హెచ్చరించారు. అయితే ఎమ్మెల్యే హెచ్చరికలను ఎక్సైజ్ అధికారులు పరిగణనలోకి తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

దాడులు కొనసాగిస్తాం

"అనధికార బెల్ట్ షాపులపై నిఘా పెడతాం. ఇప్పటికే పలు దుకాణాలపై దాడులు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాం. ఎక్కడైనా అనధికార అమ్మకాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోం."

సత్యనారాయణ, ఎక్సైజ్ సీఐ, అమలాపురం.

విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ పోరుబాట



పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీలు కుడుపూడి, ఇజ్రాయిల్, మాజీ ఎంపీ అనురాధ తదితరులు

అమలాపురం రూరల్: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 27వ తేదీన అమలాపురం మండలం ఈదరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనురాధలు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్‌ను మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఇంటివద్ద సోమవారం ఎమ్మెల్సీలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీకి చెందిన వివిధ మండలాల అధ్యక్షులు బొంతు గోవిందశెట్టి, కొనుకు బాపూజీ, ఎంపీపీలు కుడిపూడి భాగ్యలక్ష్మి, యిళ్ల శేషారావు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరిరామ్ గోపాల్, కొనుకు గౌతమి, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ వెంకటేష్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా లీగల్‌సెల్ మాజీ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అమలాపురం రూరల్: విజయవాడలో జరిగిన అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. పదో తరగతి చదువుతున్న జల్లి జితేందర్ దొర బంగారు పతకాన్ని సాధించాడు. కడిమి నాని, ఇంద్ర సోమశేఖర్‌లు ద్వితీయ బహుమతులు సాధించారు. విజేతలను పాఠశాల హెచ్ఎం విత్తనాల శ్రీనివాసరావు, పీఈటీ బుజ్జి, సర్పంచ్ చొల్లంగి శివాణిని, ఎస్ఎంసీ చైర్మన్ మంగతాయారు, వైస్ చైర్మన్, కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు పెద్దిరాజు అభినందించారు.

బాలికా విద్యతోనే ప్రగతి



పేద విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఆర్ఎం వంశీకృష్ణ

అమలాపురం రూరల్: బాలికా విద్యతోనే ప్రగతి సాధ్యపడుతుందని అమలాపురం స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ వంశీ కృష్ణ అన్నారు. అమలాపురం స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా ఈదరపల్లి రీజినల్ కార్యాలయంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా అమలాపురం, కొంకాపల్లి, కందికుప్ప, రాజోలులోని వివిధ పాఠశాలలకు చెందిన పది మంది పేద విద్యార్థినులకు ఆర్ఎం సోమవారం సైకిళ్ల పంపిణీ చేశారు. ఆడపిల్లలకు విద్యను అందించడం కేవలం హక్కు మాత్రమే కాదని అది రేపటికి పెట్టుబడిగా మారుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు, విద్యార్థులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అమిత్‌షా జాతికి క్షమాపణ చెప్పాలి

అమలాపురంలో న్యాయవాదుల నిరసన



అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ అమలాపురం కోర్టు సముదాయాల వద్ద ధర్నా చేస్తున్న న్యాయవాదులు

అమలాపురం టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా జాతికి క్షమాపణ చెప్పాలని అమలాపురం బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు డిమాండ్ చేశారు. స్థానిక కోర్టు భవనాల ఎదుట అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం ధర్నా నిర్వహించారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని, ఆయన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కోర్టు భవనాల నుంచి పాదయాత్రతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరిన సాయి, నందిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో సీనియర్ న్యాయవాదులు డీబీ లోక్, కటికదల సత్యనారాయణ, పెయ్యల సత్యనారాయణ, నల్లా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పిస్తూ అత్యున్నతమైన రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్‌పై పార్లమెంటు సాక్షిగా కేంద్రమంత్రి అమిత్‌షా అవమాన పరచడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నేరేడిమిల్లి త్రిమూర్తులు, వల్లు రాజబాబు, చల్లా సంతోష్‌కుమార్, గోడి భాస్కర్రావు, పులపకూర కృష్ణ, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, ఈశ్వరీబాయి, మంగామణి తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు.

నల్ల చట్టాలు రద్దు చేయాలి

అమలాపురం రూరల్: వ్యవసాయరంగంలోకి కార్పొరేట్ శక్తులు చొరబడటానికి వీలుగా మోదీ ప్రభుత్వం రూపకల్పన చేసిన నల్ల చట్టాలను నిరసిస్తూ ఏపీ రైతు సంఘం అంబేడ్కర్ కోనసీమ జిల్లా కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. నల్ల చట్టాల ప్రతులను దగ్ధం చేసి కలెక్టర్‌కి వినతి పత్రం అందించారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో రైతు నాయకులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



ఆర్టీసీ పార్శిల్ రవాణా కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సీఐ వీరబాబు, ఎస్సై కిషోర్‌బాబు

అమలాపురం టౌన్: నేర నిర్ధారణ, నిరోధాలకు సీసీ కెమెరాలు కీలకంగా మారుతాయని అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు అన్నారు. 216 జాతీయ రహదారిలోని వై జంక్షన్, పేరూరు పంచాయతీ పరిధిలోని తోట్లపాలెం తదితర ప్రాంతాల్లోని వ్యాపారులను సీఐ వీరబాబు, పట్టణ ఎస్సై కిషోర్‌బాబు, పోలీసు సిబ్బంది సోమవారం ఉదయం స్వయంగా కలిసి సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యతపై వివరించారు. వై జంక్షన్‌లో 10 సీసీ కెమెరాల ఏర్పాటుకు పలువురు వ్యాపారులు ముందుకు వచ్చారని సీఐ వీరబాబు తెలిపారు. వై జంక్షన్ ట్రాఫిక్ పరంగా ప్రాధాన్యత సంతరించుకుందని సీఐ గుర్తు చేశారు. త్వరలోనే ఈ జంక్షన్‌లో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పేరూరు, తోట్లపాలెంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై స్థానికులు, వ్యాపారులతో పోలీసు అధికారులు చర్చించారు. అనంతరం అమలాపురం ఆర్టీసీ బస్ స్టేషన్‌లోని కార్గో పార్శిల్ రవాణా కార్యాలయాన్ని సందర్శించారు. పార్శిల్ పంపించే వ్యక్తి నుంచి ఆధార్ సేకరణతో పాటు ఓటీపీ కూడా తీసుకోవాలని సూచించారు. కార్యాలయంలో సీసీ కెమెరాలను పరిశీలించారు.

రైతులకు సత్కారం

అమలాపురం టౌన్: జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో స్థానిక మెబర్లీపేటలో అయిదుగురు రైతులకు సోమవారం సత్కారం జరిగింది. రైతులు మట్టా ప్రభాకరరావు, వేగిరాజు సత్యనారాయణ రాజు, మెండి రాజు, వాసంశెట్టి చినబాబు, సత్తి వెత్రిబాబులను సత్కరించి వారికి రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చాంబర్ గౌరవాధ్యక్షుడు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, చాంబర్ ఫౌండర్ గోకరకొండ హరిబాబు, చాంబర్ అధ్యక్షుడు బోణం సత్య వర ప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఈ సత్కారాలు జరిగాయి. పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు చింతలపూడి సత్తిబాబు, కొవ్వూరి వెంకటరెడ్డి, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, మేడిచర్ల త్రిమూర్తులు, నమ్మిన వీరబాబు, రేకపల్లి సూరిబాబు తదితరులు పాల్గొని రైతాంగం సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు.

కలెక్టరేట్‌లో వినూత్న నిరసనకు యత్నం

అడ్డుకున్న పోలీసులు

అమలాపురం రూరల్: అధికారులు ప్రజా సమస్యలు పరిష్కారం చేయకుండా అర్జీలను పరిష్కారం చేసినట్లు తప్పుడు సమాచారం ఇచ్చిన సందర్భం గతంలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు ఏడాది పూర్తయినందుకు నిరసనగా రావులపాలెం మండల తెలుగు యువత అధ్యక్షుడు కోట చంద్రశేఖర్ అధికారుల వైఫల్యానికి సూచికగా వార్షికోత్సవ కేకును డీపీఓతో కట్ చేయించే ప్రయత్నం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు వచ్చిన ఆయన వినూత్న నిరసన తెలిపేందుకు యతి్నంచగా టౌన్ హెచ్‌సీ ఎం.సుబ్బరాజుతో పాటు పోలీసులు అడ్డుకున్నారు. గతంలో రావులపాడులో డ్రైనేజీ ఆక్రమణ సమస్యపై చంద్రశేఖర్ పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. అతని అర్జీని పరిష్కరించినట్లుగా అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భానికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన వినూత్న నిరసన తెలిపేందుకు యత్నించాడు.

ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సీపీఎం ధర్నా

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి కోనసీమ వ్యాప్తంగా పేద రోగులు వేలాదిగా వస్తున్న క్రమంలో ఈ ఆస్పత్రిని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలన్న డిమాండ్‌తో సీపీఎం పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎదుట ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి రోగులను తరలించే దుస్థితిని దూరం చేయాలని పార్టీ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 40 పడకలే అందుబాటులో ఉన్నాయని, వంద పడకలను నిరంతరం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆస్పత్రి సమస్యలపై జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పార్టీ జిల్లా నాయకులు ధర్నాలో పాల్గొన్నారు.

తెలుగు రచయితల సభలకు ఆహ్వానం

యానాం: నియోజకవర్గ పరిధిలోని గిరియాంపేట పెరుంతలైవార్ కామారాజర్ నాడర్ ప్రభుత్వ హైస్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఓలేటి దుర్గామహాలక్ష్మికి ఈ నెల 28 నుంచి 29వ తేదీ వరకు విజయవాడలో జరిగే 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు ఆహ్వానం అందింది. ఈ మేరకు తనకు సంబంధిత ఆహ్వానపత్రాలు అందినట్లు సోమవారం మహాలక్ష్మి విలేకరులకు తెలిపారు.

విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలి

అమలాపురం రూరల్: ప్రస్తుత కాలంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లను అధికంగా వినియోగిస్తున్నారని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్, ప్రముఖ సైకాలజిస్ట్ గోపాలకృష్ణ అన్నారు. కామనగరువులో ది అమలాపురం జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు ఫోన్ల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

యానాం: పుదుచ్చేరి బీచ్ వద్ద ఆదివారం సముద్రస్నానానికి వెళ్లి గల్లంతైన ఏపీ విద్యార్థి వినీత్‌రెడ్డి(18) మృతదేహం సోమవారం లభ్యమయ్యింది. కడప జిల్లాకు చెందిన వినీత్‌రెడ్డి స్థానికంగా ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్నాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ మద్దతు

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ ఆర్ సెల్వంపై అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలన్న ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేల నిర్ణయానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలుపుతుందని పార్లమెంట్ సభ్యుడు, పుదుచ్చేరి పీసీసీ చీఫ్ వి వైథిలింగం పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నియమ, నిబంధనలు స్పీకర్ స్వతంత్రంగా ఉండాలని పేర్కొంటున్నాయని కాని స్పీకర్ సెల్వం వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారుల డుమ్మా

అల్లవరం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. 24 శాఖలకు చెందిన అధికారులు హాజరు కావల్సి ఉండగా కేవలం 14 శాఖల అధికారులు మాత్రమే హాజరు కావడంతో ఎంపీడీఓ కృష్ణమోహన్ అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావల్సిందేనని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రానికి అర్జీదారులు వెళ్లకుండా కార్యదర్శులు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న రమణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: కిడ్నీ వ్యాధితో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామ శివారు నక్కావారిపేటకు చెందిన బూల వంశీరామ్‌కు గుడ్ సీడ్ ఫౌండేషన్ తన వంతు సాయంగా రూ.10 వేలు ఆర్థిక సాయం సమకూర్చింది. అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచె రమణరావు స్థానిక ఫౌండేషన్ కార్యాలయంలో రోగి తల్లిదండ్రులకు ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. పేద కుటుంబానికి చెందిన రోగి వంశీరామ్‌కు చికిత్స నిమిత్తం ఈ సాయం సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సరెళ్ల రామకృష్ణ, పినిపే జయరాజు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ప్రతినిధులు నేరేడిమిల్లి శ్రీను, ఉండ్రు రాజు, రాజా పాల్గొన్నారు.

కవి శ్రీనీలం వర్ధంతి

ముమ్మిడివరం: భారత రిపబ్లికన్ పార్టీ నాయకులు, ప్రముఖ కవి స్వర్గీయ శ్రీనీలం వర్ధంతిని సోమవారం నిర్వహించారు. పోలమ్మ చెరువు వద్ద గల బుద్ధపార్కులో చీకురుమిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు శ్రీనీలం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు.

పదిలో ఉత్తీర్ణతా శాతం పెంపునకు చర్యలు

యానాం: పదో తరగతిలో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తున్న నేపథ్యంలో ఉత్తీర్ణతా శాతం పెంపుదలకు ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టినట్లు సోమవారం ఆర్‌ఏఓ మునిస్వామి తెలిపారు. అర్ధ సంవత్సర పరీక్షలకు ప్రత్యేక క్లాసులు ప్రారంభిస్తామన్నారు. ఈ నెల 24 నుంచి కొన్ని పాఠశాలల్లోనూ, 26 నుంచి మరికొన్ని పాఠశాలల్లోనూ ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సెలవు రోజుల్లో ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో గంట చొప్పున, మిగిలిన రోజుల్లో స్కూల్ ప్రారంభానికి ముందు, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణతా శాతం పెంపుదలకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు.

నిత్యావసరాల అందజేత

ఉప్పలగుప్తం: మండలంలోని చినగాడవిల్లి పంచాయతీ పరిధి కొత్తచెరువుకు చెందిన మాకే లోవరాజు కుటుంబం ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థికంగా లోవరాజు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. సోమవారం లోవరాజు కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు.